క్లుప్తంగా

ఓటర్ల నమోదును బాధ్యతగా చేపట్టాలి



ఆత్మకూరు: కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు బీఎల్వోలు నూతన ఓటర్ల నమోదు ప్రక్రియను బాధ్యతగా చేపట్టాలని ఆత్మకూరు తహసీల్దార్ పద్మజాకుమారి అన్నారు. మున్సిపల్ కార్యాలయంలోని ఎంజీఆర్ సమావేశ మందిరంలో బీఎల్వోలకు గురువారం నిర్వహించిన ఒక్కరోజు శిక్షణా తరగతుల్లో తహసీల్దార్ మాట్లాడారు. ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు, మృతుల ఓట్ల తొలగింపు, తదితర అంశాలపై బీఎల్వోలు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం బీఎల్వోలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఏఎస్ఓ లలిత, ఆర్ఐ కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తే చర్యలు



కలిగిరి: కలిగిరిలోని పాఠశాలల సమీపంలోని కూల్‌డ్రింక్ షాపుల్లో ఏఎస్సై రామచంద్రయ్య గురువారం తనిఖీలు చేపట్టారు. పొగాకు ఉత్పత్తులను విక్రయిస్తున్న వారికి జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల సమీపంలోని దుకాణాల్లో పొగాకు ఉత్పత్తుల అమ్మకాలను నిషేధించడం జరిగిందని, ఎవరైనా విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

జాతీయ రహదారిపై కంటైనర్ బోల్తా



దగదర్తి: మండలంలోని ఉలవపాళ్ల వద్ద జాతీయ రహదారిపై గురువారం నెల్లూరు నుంచి కావలి వైపు వెళ్తున్న కంటైనర్ అదుపు తప్పి బోల్తా పడింది. అల్లూరు రోడ్డు ఫ్లైఓవర్‌పై నుంచి వస్తున్న కంటైనర్ ముందు వెళుతున్న కారును తప్పించబోయి బోల్తా పడినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. కంటైనర్ రహదారికి అడ్డంగా పడిపోవడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. దీంతో హైవే సిబ్బంది వాహనాలను సర్వీస్ రోడ్డు మీదుగా దారి మళ్లించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు. క్రేన్ సాయంతో కంటైనర్‌ను పక్కకు తొలగించేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఎస్సై జంపాని కుమార్ తెలిపారు

ఆర్థిక సాయం

సీతారామపురం : 108 వాహనంలో పనిచేస్తూ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన సీతారామపురం గ్రామానికి చెందిన ఓంకారం వెంకటనారాయణ కుటుంబానికి జిల్లా 108 సీఐటీయూ నాయకులు రూ.90,000 ఆర్థిక సాయం అందజేశారు. స్థానిక పోస్టాఫీసులో మృతుడి ఇద్దరి కుమార్తెలపై రూ.45 వేల చొప్పున ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి బాండ్లను కుటుంబ సభ్యులకు గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో 108 జిల్లా అధ్యక్షుడు సురేష్, కార్యదర్శి నాగరాజు, ట్రెజరర్ కృష్ణయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు ఖాన్‌సాహెబ్ రబ్బాని, స్థానిక 108 సిబ్బంది మధు, శ్రీనివాసులు, చలపతి, రామిరెడ్డి పాల్గొన్నారు.

టీడీపీలో బయటపడ్డ వర్గ విభేదాలు

అనుమసముద్రంపేట: మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పుట్టినరోజు వేడుకల సాక్షిగా మండల టీడీపీలోని వర్గ విభేదాలు మరోసారి బయటపడ్డాయి. గురువారం మంత్రి ఆనం పుట్టినరోజు వేడుకలను టీడీపీ మండలాధ్యక్షుడు రమేష్‌నాయుడు, మరోవర్గానికి చెందిన డాక్టర్ ఖాజామియా, ఎంబీటీ బాబు ఏఎస్‌పేటలో వేర్వేరుగా నిర్వహించారు. టీడీపీ మండల ఉపాధ్యక్షుడు పులిమి సుధాకర్‌రెడ్డి సైతం అనుమసముద్రంలో వేడుకలను నిర్వహించారు. దీంతో వర్గ విభేదాలతోనే టీడీపీ నాయకులు ఇలా వేడుకలను ఎవరికి వారు నిర్వహించారనే గుసగుసలు వినిపించాయి.

నేడు మెగా విద్యుత్ అదాలత్

కావలి (జలదంకి): కావలిలో శుక్రవారం మెగా విద్యుత్ అదాలత్‌ను నిర్వహించనున్నట్లు కావలి ఏఈ కేఎస్ బెనర్జీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయగిరి రోడ్డులో ఉన్న విద్యుత్‌శాఖ ఆపరేషన్స్ డివిజన్ కార్యాలయంలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ అదాలత్ జరుగుతుందని చెప్పారు. దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ అధికారులతో పాటు విద్యుత్ అదాలత్ చైర్‌పర్సన్ శ్రీనివాసఆంజనేయమూర్తి, ఆర్థిక సభ్యులు మధుకుమార్, స్వతంత్ర సభ్యులు విజయలక్ష్మి, తదితరులు హాజరై వినియోగదారుల సమస్యలకు పరిష్కారం చూపుతారని తెలిపారు. కావలి, బోగోలు, అల్లూరు, దగదర్తి మండలాలకు చెందిన విద్యుత్ వినియోగదారులు తమ దీర్ఘకాలిక సమస్యలను రాతపూర్వకంగా తెలియజేసి పరిష్కరించుకోవాలని కోరారు.



ఆత్మకూరులో రుద్రహోమం నిర్వహిస్తున్న దృశ్యం



సంగం: కాశీవిశ్వేశ్వరస్వామి జ్ఞానపీఠంలో నవగ్రహ యజ్ఞం



అల్లూరు: గీతాశ్రమంలో అన్నదానం



అనంతసాగరంలోని బాబా మందిరంలో అన్నదానం

భక్తిశ్రద్ధలతో గురుపూర్ణిమ వేడుకలు

ఆత్మకూరు: పట్టణంలో గురుపూర్ణిమ వేడుకలను గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలోని సాయిబాబా మందిరాల్లో సాయిబాబాకు విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. సాయిబాబాను పూలతో విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. శివాలయ ప్రాంగణంలోని సాయిబాబా మందిరంలో అర్చకులు మేళ్లచెరువు శివకుమారశర్మ ఆధ్వర్యంలో లోకకల్యాణం కోసం నవగ్రహ, సాయినాథ, రుద్రహోమాలు నిర్వహించారు. మధ్యాహ్నం భారీ స్థాయిలో అన్న ప్రసాద వితరణ చేశారు. మెయిన్ బజారులోని సాయి మందిరంలో సాయికీర్తనలు ఆలపించారు.

సోమశిల: అనంతసాగరం మండలం సోమశిల, మంచాలపల్లి, అనంతసాగరం, రేవూరులోని సాయిబాబా మందిరాల్లో విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం భజనలు నిర్వహించారు.

వైభవంగా భారతీయ ఋషిపరంపర పాదకాపూజ

సంగం: స్థానిక తిరుమనకొండపై ఉన్న రాజరాజేశ్వరిదేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి జ్ఞానపీఠంలో భారతీయ ఋషి పరంపర పాదుకా పూజను పీఠాధిపతి రాజరాజేశ్వరానందస్వామి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఉదయం రుద్రాభిషేకం, శ్రీచక్రపూజ, శ్రీలలితా సహస్రనామార్చన, వారాహి గణపతి, నవగ్రహ యజ్ఞం నిర్వహించారు. పీఠాధిపతి రాజరాజేశ్వరానందస్వామి భక్తులను ఉద్దేసించి జ్ఞానబోధ చేశారు. భారతీయ ఋషులు ధ్యాన ప్రాణాయామం, మంత్ర జపాలతో దైవత్యం పొందారని, మానవులు, సన్మార్గంలో నడవాలంటే ధ్యానం, జపం, ప్రాణాయామం అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో సుబోధానందస్వామి సహదేవుడు విశ్వజ్ఞాచారి ఉషశ్రీ పాల్గొన్నారు. అలాగే సంగంలోని సాయినగర్‌లోని సాయిబాబా మందిరంలో విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.



సీతారామపురం: ఘటిక సిద్ధేశ్వరంలో శివుడికి అన్నాభిషేకం



సీతారామపురంలోని యోగానంద ఆశ్రమంలో..

గీతాశ్రమంలో విశేష పూజలు

అల్లూరు: స్థానిక గీతా ఆశ్రమంలో విశేష పూజలు నిర్వహించారు. భక్తులు భజనలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.ఈ కార్యక్రమంలో పెద్దలు బాలకృష్ణంరాజు, గంగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పల్లకిసేవ

ఉదయగిరి: పట్టణంలోని బీసీ కాలనీలోని సాయిబాబా మందిరంలో ఉదయం కాకడ హారతి, పంచామృతాభిషేకాలు, విశేష పూజలు, పల్లకిసేవ నిర్వహించారు. సాయిబాబాను విశేషాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

ఉదయగిరి రూరల్: గండిపాళెం జలాశయం సమీపంలోని సిద్ధేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న సాయిబాబా మందిరం, పరమేశ్వరుడు, దత్తాత్రేయుడు, ఆంజనేయస్వామి ఆలయాల్లో విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. సాయిబాబా, పరమేశ్వరునికి భక్తులు పంచామృతాభిషేకాలు చేశారు.

జలదంకి: చామదల, బ్రాహ్మణక్రాకలోని సాయిబాబా మందిరాల్లో గురుపూర్ణిమ వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఉదయం కాకడహారతి, గణపతి పూజ, పుణ్యాహవాచనం, బాబాకు క్షీరాభిషేకం, సహస్రనామ పుష్పార్చన, మంత్రపుష్పం, తీర్థప్రసాద వినియోగం తదితర పూజలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. చామదలలో మందిర వ్యవస్థాపకులు వంటేరు హజరత్‌రెడ్డి, సుమతి దంపతులు, బ్రాహ్మణక్రాకలో ఆలయ వ్యవస్థాపకురాలు, జెడ్పీటీసీ మేదరమెట్ల శివలీల ఉభయకర్తలుగా వ్యవహరించారు. మధ్యాహ్నం భారీస్థాయిలో అన్నదానం చేశారు. సాయంత్రం సాయినాధుని రథోత్సవం, సంధ్యాహారతి, పల్లకిసేవ నిర్వహించారు. చామదలలో అన్నదాతలుగా వంటేరు నారాయణరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, అంజిరెడ్డి, రంగారెడ్డి, నర్సింహరెడ్డి, రఘురామిరెడ్డి, సోము శ్రీనివాసులరెడ్డి వ్యవహరించారు.



కలిగిరి: బాబాను దర్శించుకుంటున్న భక్తులు



ఉదయగిరిరూరల్: గండిపాళెంలోని పరమేశ్వరుని ఆలయంలో..

సీతారామపురం : స్థానిక బాలత్రిపుర సుందరి యోగానంద ఆశ్రమ ప్రాంగణంలోని సాయిబాబా మందిరంలో విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. ఘటిక సిద్ధేశ్వరంలో పరమశివుడికి అన్నాభిషేకం నిర్వహించారు. ఇష్టకామేశ్వరిదేవి, కాశీనాయనస్వామి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

కలిగిరి: స్థానిక షిర్డీ సాయిబాబా మందిరంలో విశేషాభిషేకాలు, పూజలు, పల్లకిసేవ నిర్వహించారు. సాయిబాబా విశేషాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మధ్యాహ్నం భారీస్థాయిలో అన్నదానం చేశారు.

గ్రామాల అభివృద్ధికి చొరవచూపాలి

కొండాపురం: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో గ్రామాల అభివృద్ధికి చొరవచూపాలని ఎంపీపీ బొడ్డు అనురాధ కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షత మండల సర్వసభ్య సమావేశాన్ని గురువారం నిర్వహించారు. తొలుత అధికారులు శాఖల వారీగా ప్రగతిని చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. చెత్త నుంచి సంపద కేంద్రాల ద్వారా వచ్చే నిధులను పంచాయతీలకు ఉపయోగించాలన్నారు. ఎంపీడీఓ ఆదినారాయణ, ప్రజాప్రతినిధులు, మండలాధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ

సత్యాన్వేషణ యోగాలయం ప్రారంభం

కావలి (జలదంకి): గురుపూర్ణిమ సందర్భంగా కావలిలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో సత్యాన్వేషణ యోగాలయాన్ని గురువారం ప్రారంభించారు. గుల్లా అనంతప్రసాద్ ఆధ్వర్యంలో యోగా గురువులు గోపాల్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, సావిత్రి ఏర్పాటు చేసిన ఈ ఆలయాన్ని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం యోగా గురువులను సత్కరించి వారి ఆశీర్వాదం తీసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ యోగాతో సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 6.15 నుంచి 7.15 గంటల వరకు జరిగే యోగా తరగతులు ఉంటాయన్నారు. పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కందుకూరి సత్యనారాయణ, గ్రంధి రమేష్, తదితరులు పాల్గొన్నారు.



యోగా గురువులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి

విద్యార్థులకు నగదు బహుమతుల ప్రదానం



సోమశిల: అనంతసాగరం మండలం సోమశిలలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీటీఎం సమావేశాన్ని గురువారం నిర్వహించారు. పూర్వ విద్యార్థి, వర్ల విశ్వనాథ్ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత వర్ల కొండయ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గత విద్యాసంవత్సరంలో పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు వరుసగా రూ.3వేలు, రూ.2వేలు, రూ.1000 వంతున నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. అనంతరం తన సొంత నిధులతో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వర్ల కొండయ్యను హెచ్‌ఎం నాగరాజు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.

కుక్కల దాడిలో చుక్కలదుప్పి మృతి



ఉదయగిరి రూరల్: మండలంలోని జి.అయ్యవారిపల్లెలో చుక్కలదుప్పిపై కుక్కలు దాడి చేయడంతో మృతిచెందిన ఘటన గురువారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి.. అటవీ ప్రాంతం నుంచి తాగునీటి కోసం గ్రామంలోకి వచ్చిన దుప్పిపై కుక్కలు దాడి చేశాయి. గమనించిన స్థానికులు కుక్కలను తరిమారు. అయితే తీవ్రంగా గాయపడిన దుప్పి కొద్దిసేపటికి మృతి చెందింది. గ్రామస్తులు విషయాన్ని ఎస్సై శ్రీనివాసులుకు సమాచారం అందించారు. ఆయన అటవీ రేంజ్ అధికారి కుమార్‌రాజాకు తెలియజేశారు. రేంజ్ అధికారి ఆదేశాల మేరకు కొత్తపల్లి ఎఫ్‌బీఓ గౌతమ్ తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని మృతి చెందిన దుప్పిని ఉదయగిరి అటవీ శాఖ కార్యాలయానికి తరలించారు. శుక్రవారం పోస్టుమార్టం నిర్వహించి రిజర్వ్ ఫారెస్ట్‌లో దహనం చేయనున్నట్లు వారు తెలిపారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

కలిగిరి/వింజమూరు(ఉదయగిరి)/ఆత్మకూరు/అనుమసముద్రంపేట/సంగం/సీతారామపురం/జలదంకి : విద్యతోనే ఉజ్వల భవిత ఉంటుందని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అన్నారు. కలిగిరిలోని ఏపీ మోడల్ స్కూల్, వింజమూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాలకు ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలను కల్పిస్తున్నామని తెలిపారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులు, తల్లిదండ్రులకు బహుమతు లు అందజేశారు. అలాగే ఆత్మకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం అనంతలక్ష్మి, చేజర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం శ్రావణి ఆధ్వర్యంలో పీటీఎం సమావేశాలను నిర్వహించారు. ఏఎస్‌పేట జెడ్పీహెచ్‌ఎస్, ఉర్దూ మెయిన్ పాఠశాలల్లో జరిగిన పీటీఎంలలో ఎంఈఓ సాయిప్రసాద్ పాల్గొని తల్లిదండ్రులకు సూచనలు చేశారు. అనంతరం విద్యార్థులతో మొక్కలను నాటించారు. అలాగే వింజమూరులోని పాతూరు మండల పరిషత్ పాఠశాల అభివృద్ధికి విశ్రాంత డీఎంహెచ్ఓ డాక్టర్ కే మాశిలామణి రూ.10 వేలు విరాళాన్ని అందజేశారు. అలాగే వెలుగోటి మధు, సూరం వీరభాస్కర్ రెడ్డి, గంగిశెట్టి రత్తయ్య, పల్లాల కొండారెడ్డి, తదితరులు కూడా విరాళాలను అందించారు. వింజమూరు బాలికోన్నత పాఠశాలలో జరిగిన మెగా పీటీఎంలో గతేడాది పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభకనబరచిన విద్యార్థినులకు నగదు బహుమతులు అందజేశారు. అలాగే ఉదయగిరి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన మెగా పీటీఎంలో పలువురు దాతలు విద్యార్థులకు నోట్‌పుస్తకాలు అందజేశారు. గంగిరెడ్డిపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన పీటీఎంలో ఎంఈఓ తోట శ్రీనివాసులు విద్యార్థుల పట్ల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల బాధ్యతలను తెలియజేశారు. సంగం జెడ్పీ హైస్కూల్‌లో హెచ్‌ఎం బుజ్జయ్య ఆధ్వర్యంలో తల్లిదండ్రులకు ముగ్గులు, ఆటల పోటీలు నిర్వహించారు. అలాగే సీతారామపురంలోని ఏపీ ఆదర్శ పాఠశాలలో ప్రిన్సిపల్ సమీరారెడ్డి తల్లిదండ్రులకు సూచనలు చేశారు. జలదంకి మండలం అన్నవరం పాఠశాలలో విద్యార్థులతో పాటు తల్లిదండ్రులకు ఆటలు, పాటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అనంతరం మొక్కలను పంపిణీ చేశారు.

రాష్ట్ర మహాసభల జయప్రదానికి పిలుపు

ఉదయగిరి రూరల్: నెల్లూరులో ఈ నెల 27 28 తేదీల్లో నిర్వహిస్తున్న ఏపీ వడ్డెర వృత్తిదారుల సంఘం ప్రథమ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా నాయకుడు బత్తల నాగరాజు గురువారం ఒక ప్రకటనలో కోరారు. వడ్డెరలకు రక్షణ భద్రత కల్పించాలని, వడ్డెర కులాన్ని ఎస్టీల జాబితాలో చేర్చాలని, క్వారీల్లో పనులు వడ్డెరులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. కుప్రపల్లి బీసీ కాలనీలోని వడ్డెరులకు ఆర్థిక సంవత్సరం ప్రారంభమై మూడు నెలలు గడిచినా ఇప్పటి వరకు ఉపాధిహామీ పనులు కల్పించలేదన్నారు. అధికారులు స్పందించి వెంటనే కూలీలకు ఉపాధి హామీ పనులు కల్పించాలని కోరారు.

డీసీపల్లిలో 670 పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో గురువారం 670 పొగాకు బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 824 బేళ్లు రాగా, అందులో 670 బేళ్లను విక్రయించామని చెప్పారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.280, కనిష్టంగా రూ.159, సగటున రూ.206.10 ధర పలికిందని వివరించారు.

పశుపోషణలో మెళకువలు పాటించాలి

ఉదయగిరి రూరల్: పశుపోషణలో పాడి రైతులు మెళకువలు పాటించాలని పశువైద్యాధికారి ఎస్వీ రాఘవేందర్‌శర్మ సూచించారు. వెంగళరావునగర్, కొండాయపాళెం రైతుసేవా కేంద్రాల్లో పాడి రైతులకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పశుగ్రాసం క్షేత్రాల పెంపకానికి చేయూతనిస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి కలిగిన పాడిరైతులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అనంతరం పాడిపోషణలో పశుగ్రాసాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలన్నారు. వెంగళరావునగర్ సర్పంచ్ తిరుపతయ్య, వెటర్నరీ అసిస్టెంట్లు మహేశ్వరి, ఖాజామొహిద్దీన్, కిషోర్ పాల్గొన్నారు.

ఉపకారవేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఆత్మకూరు: కేంద్ర కార్మిక శాఖ బీడీ కార్మికులతో పాటు ఐరన్, మైకా, సున్నపురాయి, తదితర గనుల్లో పనిచేసే కార్మికుల పిల్లల నుంచి ఉపకారవేతనాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తోందని ఆత్మకూరు కార్మిక డిస్పెన్సరీ డాక్టర్ ఎస్ అర్జున్‌రావు గురువారం తెలిపారు. ఇందుకోసం 1 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులు ఆగస్టు 31, ఐటీఐ, ఇంటర్, డిగ్రీ, బీటెక్, ఎంబీఏ, అగ్రికల్చర్ కోర్సులు చదివే విద్యార్థులు అక్టోబరు 31వ తేదీలోగా నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కు 040 29561297 నంబరులో సంప్రదించాలని కోరారు.

బాధితులకు పరామర్శ



జలదంకి: స్థానిక గిరిజనకాలనీలో బుధవారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులు పోట్లూరి శివ,భారతి దంపతులను వైఎస్సార్‌సీపీ నాయకులు గురువారం పరామర్శించారు. పార్టీ మండలాధ్యక్షుడు ఇస్కా మదన్‌మోహన్‌రెడ్డి, నాయకులు సురె వెంకటశేషారెడ్డి, దేవరపల్లి మధుసూదన్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

బీఎంసీబీ చర్చి @140 ఏళ్లు

- నేటి నుంచి మూడ్రోజుల పాటు వార్షిక వేడుకలు

ఉదయగిరి: పట్టణంలోని స్టేట్‌పేటలో ఉన్న పురాతన బర్డిట్ మెమోరియల్ సెంటినరీ బాప్టిస్ట్ చర్చి శుక్రవారంతో 140 వసంతాలను పూర్తి చేసుకోనుంది. ఈ చర్చిని 1886 జూలై 11న విదేశీయుడైన బర్డిట్ దొర స్థాపించారు. 1898లో సెయింట్ దొర ఉదయగిరి వచ్చిన తర్వాత ఈ ప్రాంతంలో రెవ సెయింట్ దొరసానమ్మ ఇక్కడే మకాంపెట్టి వైద్యసేవలందించారు. ఆ సమయంలో చర్చికి మంచి గుర్తింపు లభించింది. 1902లో ఇదే ప్రాంగణంలో ఆస్పత్రి భవనాన్ని నిర్మించి ఈటా మెమోరియల్ పేరు పెట్టి వైద్యసేవలందించారు. అనంతరం సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేశారు. అప్పటి నుంచి నేటి వరకు చర్చిలో వివిధ కార్యక్రమాలు జరుగుతున్నాయి. గతంలో ఎంతో చిన్నదిగా ఉండే చర్చిని సంఘసభ్యులు క్రమంగా అభివృద్ధి చేశారు.



నేటి నుంచి వార్షికోత్సవ పండుగలు

స్థానిక బర్డిట్ మెమోరియల్ సెంటినరీ బాప్టిస్ట్ చర్చి 140 వసంతాలు పూర్తిచేసుకుంటున్న సందర్భంగా బుధవారం నుంచి శుక్రవారం వరకు వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి సంఘస్తులు సన్నాహాలు చేస్తున్నారు. స్థానిక సంఘకాపరితో పాటు నెల్లూరు నగరానికి చెందిన దైవసేవకులు పాల్గొని దైవసందేశం అందజేస్తారని సంఘ కమిటీ సభ్యులు తెలిపారు. వార్షికోత్సవ మహాసభలు ప్రతిరోజూ సాయంత్రం 6 గంటల నుంచి ప్రారంభమవుతాయని, ప్రతి ఒక్కరూ పాల్గొని దేవుని దీవెనలు పొందాలని సంఘ కమిటీ కోరింది.

పాఠశాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని వినతి

జలదంకి: మండల కేంద్రమైన జలదంకిలోని అరుంధతీయవాడ ప్రాథమిక పాఠశాల నుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వరకు రోడ్డు సౌకర్యం కల్పించాలని స్థానికుడు చినకొండయ్య కోరారు. ఈ మేరకు జలదంకి తహసీల్దార్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన ప్రత్యేక గ్రీవెన్స్‌లో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కొండయ్య మాట్లాడుతూ గతంలో సర్వే నంబర్‌లోని 773లోని 60 సెంట్ల గ్రామనత్తం స్థలంలో రోడ్డు నిర్మాణానికి ఎంపీడీఓ, తహసీల్దార్ సర్వేయర్‌తో కొలతలు వేసి హద్దులు కూడా చూపారన్నారు. రోడ్డు మధ్యలో ఉన్న చిన్నగుడిసెను కూడా తొలగించేందుకు అందులో ఉన్న వారు అంగీకరించారని తెలిపారు. అప్పట్లో త్వరలో రోడ్డు ఏర్పాటు చేస్తామని అధికారులు హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ప్రస్తుతం పాఠశాలను మోడల్ స్కూల్‌గా మార్చారని తెలిపారు. అయితే పాఠశాలకు రోడ్డు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి గుడిసెను తొలగించి పాఠశాలకు రోడ్డును నిర్మించాలని కోరారు.



అధికారులకు వినతిపత్రం ఇస్తున్న చినకొండయ్య

త్వరలో మెగా జాబ్‌మేళా

ఆత్మకూరు: ఆత్మకూరు నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు డీఆర్డీఏ మాజీ చైర్మన్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు గుండ్రా సతీష్‌రెడ్డి, మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చొరవతో ఆగస్టు మొదటి వారంలో మెగా జాబ్‌మేళాను నిర్వహించనున్నట్లు ఆత్మకూరు ఆర్డీఓ బీ పావని తెలిపారు. గురువారం ఆమె పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో వివిధ శాఖల అధికారులు, కంపెనీల ప్రతినిధులతో సమావేశమై జాబ్‌మేళా నిర్వహణపై చర్చించారు. అనంతరం జాబ్‌మేళా నిర్వహణ కోసం మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ భవనాలను, పాలిటెక్నిక్, ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాల భవనాలను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ సీ గంగా ప్రసాద్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఖయ్యూం, రీజనల్ ప్లేస్‌మెంట్ జిల్లా అధికారి జనార్దన్, రీజనల్ ప్లేస్‌మెంట్ అధికారిణి కిరణ్మయి, ఐటీఐ, పాలిటెక్నిక్ ప్రిన్సిపల్స్, చెన్నై ఎంఏబీఓఐ గ్రూపు కంపెనీ హెచ్‌ఆర్ ,బిజినెస్ హెడ్ స్వామినాథన్, కన్నన్, బీజేపీ నాయకుడు కే సుధాకర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బాధిత యువకుడికి చేయూత



ఆత్మకూరు: పట్టణంలోని 13వ వార్డుకు చెందిన తేజేష్‌కు డాక్టర్ వింజం దొరసానమ్మ మెమోరియల్ ట్రస్టు అధినేత, వైఎస్సార్‌సీపీ డాక్టర్స్ వింగ్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ప్రణీత్ చేయూతనందించారు. తేజేష్ మెదడు సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. అతను జీవితాంతం మందులు మింగాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ విషయం తెలుసుకున్న డాక్టర్ ప్రణీత్ బాధిత యువకుడ్ని గురువారం తన ఆస్పత్రికి పిలిపించుకుని మూడు నెలలకు సరిపడా మందులు అందజేశారు. భవిష్యత్‌లోనూ తమ ట్రస్టు తరఫున సహాయ సహకారాలు అందజేస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట డాక్టర్ కుమార్, తోడేటి అశోక్ తదితరులు ఉన్నారు.

టీడీపీ వర్గీయుల నడుమ ఘర్షణ

ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని రెండో వార్డు వెంకట్రావుపల్లిలో టీడీపీ వర్గీయుల మధ్యన ఘర్షణ చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. స్థానికుడు కరేటి విజయ్ గత కొన్నేళ్లుగా టీడీపీ కార్యకర్తగా కొనసాగుతున్నాడు. ఆయనకు గతేడాది టీడీపీలో చేరిన కౌన్సిలర్ శివకోటారెడ్డి మధ్యన అభిప్రాయ బేధాలు తలెత్తాయి. ఈ నేపథ్యంలో తనతో సంబంధం లేకుండా విజయ్ సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తుండడంపై శివకోటారెడ్డి కోపగించుకుని అతన్ని నిలువరించాడు. దీంతో వారిద్దరి మధ్యన చిన్నపాటి గొడవ చోటుచేసుకుంది. దీంతో పట్టణ టీడీపీ నాయకుల సహకారంతో విజయ్‌పై శివకోటారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు గురువారం వేకువజామున విజయ్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దీంతో టీడీపీలో నాయకులు, కార్యకర్తల మధ్య అభిప్రాయభేదాలు ప్రస్ఫుటమయ్యాయి. ఈ విషయం వెలుగులోకి రావడంతో కొందరు టీడీపీ నాయకులు వెళ్లి పోలీసుల అదుపులో ఉన్న కరేటి విజయ్‌ను బయటకు తీసుకొచ్చారు. తొలి నుంచి టీడీపీలో కొనసాగుతూ చురుకుగా ఉండే కార్యకర్తపై ఇటీవల పార్టీలో చేరిన కౌన్సిలర్ ఫిర్యాదు చేయడంతో పాటు కేసు నమోదు చేయించడంపై అసలైన టీడీపీ వారు మండిపడుతున్నారు.